
ఆంధ్రజ్యోతి తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) రాజ్యలక్ష్మీ ఫౌండేషన్ (మద్రాస్)

# ఔషధం



చిటకురి దేవపుత్ర

"శివకుమార్!" అంటూ సుందరం బయటినుంచే పిలిచాడు మా అన్నయ్యని.

"ఆ వస్తున్నానుండరా!" అంటూ బట్టలేసుకుంటూనే అన్నయ్య బదులిచ్చాడు.

రెండు నిమిషాల తరువాత అన్నయ్య బయటికి వెళ్ళిపోయాడు. ప్రతి

'కథలు, వ్యాసాల' పోటీలో **కన్సొలేషన్** బహుమతి పొందిన కథ!

రోజు సాయంత్రమవుతుంటే వాళ్ళిద్దరూ లైబ్రరీకి వెళుతుంటారు. ఇంట్లో మా నాన్న లేడు గానీ, వుండుంటేనా— ఈ పాటికి 'ఆ వెధవ పిలవడమూ, ఈ దరిద్రపు వెధవ ఇదిగో వస్తున్నానంటూ లింగు లింగుమంటూ పోవడమూ...!' అంటూ గొణిగేవాడు.



సుందరమంటే మా నాన్నకే కాదు నాకూ గిట్టదు. ఎందుకో మరి! ఈ విషయమై ఒక్కోసారి నన్ను నేనే ప్రశ్నించుకుంటాను.. సుందరం కులం తక్కువవాడనా! అన్నయ్యతో ప్రాణానికి ప్రాణంగా వుంటాడనా? నాన్న నాలో సుందరమంటే కలిగించిన అసహ్యమా? ఏమో తెలీదు...

అలాంటివాళ్ళతో స్నేహం చేయడం మా ఇంటా వంటా లేదు. 'కులంలోనూ, గుణంలోనూ ఎంతో ఉన్నతులయి వుంటేనే, మా కుటుంబంలోని ఏ మనిషితోనైనా స్నేహం చేయడానికి మొదటి అర్హత!' అన్నది మా తాతయ్య సిద్ధాంతం. అందులో ఏమాత్రం అతిశయోక్తి లేదని నా నిశ్చితాభిప్రాయం!

అవును మరి! మాది చాలా సనాతనమైన కుటుంబం! మా తాతలూ, ముత్తాతలూ మా పల్లెలో ఎంతో గొప్పగా బ్రతికారు. మా కులంలోనే మా వంశం వాళ్లంటే నిప్పులాంటివారని చెప్పకుంటూ వుంటారు. మా నాన్న కూడా ఆచార వ్యవహారాల్లో ఎవరికీ తీసిపోరు. ఎన్ని పనులున్నా సంధ్య వార్చడాలూ, పూజలు చేయడాలూ మానుకునేవారు కాదు. మా నాన్న ఇక ప్రతి ఏకాదశి నాడు నోట్లో పచ్చి మంచినీళ్ళు పోయకుండా ఉపవాసాలు ఆచరించేవాడు. ఇవన్నీ ఆయన సత్సంప్రదాయాన్ని నిలబెడుతున్నందుకు నిదర్శనాలు. ఆయనతోపాటు నేనూ పూజకు కూచుంటే ఎంత సంతోషపడతాడో. అందుకే అన్నయ్యను ఇష్టపడ్డం కంటే చాలా విషయాల్లో నన్నే ఎక్కువగా ఇష్టపడతాడు నాన్న. అన్నయ్య, నాన్న ఇష్టాలన్నింటికీ ఎప్పుడూ ఎదురే! నాన్న ఏమి మాట్లాడినా విననట్టుగానే వుండేవాడు అన్నయ్య.

ఒక అయిదు సంవత్సరాల క్రితం అనుకుంటా సుందరం వాళ్ళు మా ఎదురింట్లో దిగారు. సుందరం నాన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్. సుందరాన్ని తన క్లాస్‌మేట్‌గా నాకు పరిచయం చేశాడు అన్నయ్య ఓ రోజు. నల్లగా, పెద్ద పెద్ద కళ్లతో, స్ఫుటంగా వున్న ముక్కూ, నల్లటి వత్తయిన మీసకట్టూ, నవ్వే పెదాల మధ్య చక్కని పలువరసా... చూసి నలుపులో కూడా ఒకింత కళ వుంటుందేమోననిపించింది.

"మాలవాడితో స్నేహమేమిట్రా శివా?" అంటూ నాన్న ఆ మరునాడే అన్నయ్యని మందలిస్తూ వుంటే అప్పుడు తెలిసింది సుందరం కులం ఏమిటో. మా ఇంటి చుట్టుపక్కల వాళ్ళు ఏయే కులాలకి చెందినవాళ్లో తెలుసు నాన్నకి. ఎవరైనా కొత్తగా మా వీధిలో చేరారనుకోండి. వెంటనే వాళ్ళ కులాన్ని ఆ సాయంత్రానికల్లా ఆరా తీసేస్తాడు నాన్న. సుందరం కులం మాల అని తెలిసిన మరుక్షణం నుంచి సుందరం మొహంలో కులంలోని నీచత్వమంతా గూడు కట్టుకున్నట్టు అనిపించేది. "వాడితో స్నేహం వదిలేయకుంటే నీ చర్మం వలిచేస్తా!" అని అన్నయ్యని సీరియస్‌గానే అరిచాడు నాన్న ఒకరోజు.

"సుందరానికి ట్యూషన్లో మంచి నోట్స్ ఇస్తారు నాన్నా! నువ్వేమో నన్ను ట్యూషన్‌కు పంపవు. కాబట్టి నేను వాడి నోట్స్‌ను కాపీ చేసుకుంటున్నాను. అందులోనూ నాకు అర్థంకాని లెక్కలు బాగా అర్థమయ్యేలా చెబుతాడు వాడు!" అన్నాడు అన్నయ్య తొణక్కుండా.

అంతే— ఎక్కడన్నా పాడయిపోనీలే అనుకున్నాడేమో నాన్న— ఊరకుండిపోయాడు.

## 2

అప్పటికి బాగా చీకటిపడిపోయింది.

అన్నయ్యా, సుందరం ఇంకా ఇల్లు చేరలేదు.

అమ్మ వంటింట్లో ఆకుకూర వలుస్తూ వుంది. నేను మధ్య గదిలో నా క్లాసు పుస్తకాల్ని ముందేసుకున్నాను చదువుకోవడానికి.

"ఏమండీ! ఏమండీ!!" అంటూ బయటినుంచి ఎవరిదో కొత్త గొంతు వినిపించినట్టయితే లేచి

వెళ్ళాను. దాదావు వలభై అయిదేళ్ళ మనిషి నిలబడి వున్నాడు.

"ఎవరు కావాలండీ?"

"మల్లేశ్వర్రావుకి మువ్వేమవుతావు బాబూ!" అడిగాడు అతను.

"కొడుకుని... ఏం కావాలి?"

"ఏం వద్దు బాబూ! మీ నాన్న బజార్లో వస్తూ వుంటే.. ఎవరో స్కూటరతను ఆక్సిడెంటు చేసి వెళ్ళిపోయాడు. మీ నాన్న పక్క ఆఫీసులోనే నేను పనిచేసేది. ఇప్పడే మీ నాన్నని పెద్దాసుపత్రిలో చేర్పించేసి వస్తున్నాను" అంటూ అతను చెబుతూ వుంటే నా తల దిమ్మెక్కిపోయింది.

ఇంతలో అమ్మ వచ్చింది. విషయమంతా అతనే చెప్పాడు. వెంటనే వెళ్లండని మరోమారు చెప్పేసి అతను వెళ్ళిపోయాడు. అమ్మ బోరున ఏడ్చేస్తోంది. నేను గబగబా ఇంటికి తాళం వేసేశాను.

అప్పడు వచ్చారు అన్నయ్యా, సుందరం. విషయమంతా టూకీగా చెప్పాను అన్నయ్యకి. సుందరం ఆలస్యం చేయకుండా ఆటో తీసుకువచ్చాడు. అందరం ఆటోలో పెద్దాసుపత్రికి చేరుకున్నాం. అప్పటికే తలకి కట్టుకట్టారు. నాన్న కళ్లు మూసుకుని మంచంమీద పడుకుని వున్నాడు. అమ్మ మౌనంగా ఏడుస్తూ నాన్న పక్కనే కూర్చుంది. మేం ముగ్గురం డాక్టర్ని కలిశాం.

"మీ నాన్న పరిస్థితి మెరుగ్గానే వుంది. కాకపోతే తలకి గాయం అయివందువల్ల రక్తం బాగా పోయింది. రక్తం ఒక బాటిలయినా ఎక్కించాల్సి వుంటుంది" అన్నారు డాక్టరు. అక్కడిమంచి వచ్చేశాం. ఎక్కడిమంచి తేవడం రక్తాన్ని?

"బ్లడ్‌బ్యాంక్‌లో వుండదా?" అన్నాను అన్నయ్యా.

"ఉంటే ఈపాటికి ఎక్కించేవాళ్లుగా! నాన్న రక్తం 'బి' గ్రూవుకు చెందినదట. మన రక్తం సరిపోతుందిలేరా! ఊరికే ఆందోళనపడకు!" అన్నాడు అన్నయ్య.

మేం ముగ్గురం రక్తపరీక్ష గదిలోకి వెళ్ళి మా రక్తం ఏ గ్రూవుదో పరీక్షించేందుకు శాంపిల్స్ ఇచ్చాం. సుందరం తవ రక్తాన్ని కూడా శాంపిల్ ఇవ్వడం నాకైతే వచ్చలేదు. ఒకవేళ మా అన్నదమ్ముల ఇద్దరి రక్తం సరిపడకపోతేనో! సుందరం రక్తమే 'బి' గ్రూప్‌ది అయివుంటేనో అప్పడెలా- భగవాన్ అలా జరగకూడదు. ఆచార పరాయణుడైన నాన్న రక్తంలో ఒక అంటరాని కులంవాడి రక్తమా! ఇంక ఆలోచించలేక అమ్మ వున్నచోటికి వచ్చేశాను.

పావుగంట తర్వాత అన్నయ్య వచ్చాడు "నీది 'ఎ' పాజిటివ్‌రా చంద్రం. నాది 'బి' గ్రూప్. నాన్న రక్తానికి సూటవుతుందట. బాటిల్ రక్తం ఇచ్చేశాను" అన్నాడు.

"మరి సుందరానిది?" వెంటనే అడిగాను.

"అతనిది 'ఓ' నెగెటివ్ రక్తం!" అన్నాడు.

అమ్మయ్య! అతనిది 'బి' గ్రూప్ రక్తం కాదు.. చాలు. దేవుడు మనపాలిట వున్నాడు.. ఎందుకో కొండంత భారం దిగిపోయినట్టు అనిపించింది.

మూడునెలల తర్వాత నాన్న మామూలు మనిషయిపోయాడు.

## 3

అన్నయ్యకు డిగ్రీ ఎగ్జామ్స్ మరో పదిహేను రోజులు వున్నాయనగా సరిగ్గా అప్పడు మా పెదనాన్న కూతురి పెళ్ళికి బళ్ళారికి వెళ్ళి తీరాలన్నాడు నాన్న. "ఎగ్జామ్స్ వున్నాయి నేను రాను!" అన్నాడు అన్నయ్య.

"సరే, మేం వెళ్తాం. నువ్వు హోటల్లో భోంచేసెయ్యి!" అన్నాడు నాన్న.

"నాకు హోటల్ భోజనం పడదు నాన్నా!"

"ఒరే చంద్రం! నువ్వు అన్నయ్యకు అన్నం వండిపెట్టు.. మీ అమ్మా, నేనూ వెళ్తాం!" అన్నాడు నాన్న నాతో.

నాకు ఒళ్లు మండింది. హాయిగా పెళ్ళికి వెళ్ళకుండా ఈ దరిద్రపు అవస్థేంటి నాకు! "ఈ మహా మభావుడు హోటల్లో తినవచ్చు కదా!" అన్నాను.

నాన్న పక్క గదిలోకి నన్ను తీసుకెళ్ళి- "నా మాట వినరా చంద్రం! ఒకవేళ వాడు హోటల్లో తినడానికి ఒప్పకున్నాడే అనుకో... వాడు ఆ హోటల్లో తింటాడని గ్యారంటీ ఏమిటి? వాడసలే అప్రాచ్యపు వెధవ. మనం అలా వెళ్తూనే ఇలా ఆ సుందరం గాడి ఇంట్లో దూరి 'మాలకూడు' తింటాడురా! చిన్నప్పడు అడ్డమైన చోటల్లా తిన్నాడని వాడి నాలుకని బంగారు కడ్డీతో కాల్పించాం, నీకు తెలుసు కదా! వాడి బుద్ధే వంకరబుద్ధి. నువ్వు పెద్ద మనసు చేసుకుని వండిపెట్టరా!" అంటూ నాన్న బతిమాలుతూ వుంటే మారుమాట్లాడకుండా సరేనన్నట్టు తల ఆడించాను.

ఆ సాయంత్రమే అమ్మానాన్నలు పెళ్ళికి వెళ్ళిపోయినారు. ఎల్లుండికి కానీ రారు.

రాత్రి పదకొండు గంటలవరకు అన్నయ్య చదువుకుని నిద్రపోయాడు. నేను లైట్ ఆఫ్‌చేసి పడుకున్నాను.

గట్టిగా మూలుగు వినబడినట్టయితే లేచి చూశాను. అన్నయ్య మంచంపైన ముడుచుకుని పడుకుని మూలుగుతూ వున్నాడు. లైటు వేసి పలుకరించాను. 'ఊ' అంటాడు కానీ లేవడు. నుదుటిపైన చేయి పెట్టి చూశాను. బాగా కాలిపోతూ వుంది. నాకేం చేయాలో పాలుపోలేదు. వెంటనే ఎదురింటికెళ్ళి సుందరాన్ని పిలుచుకు వచ్చాను.

అన్నయ్య పరిస్థితిని కాసేపు గమనించాడు సుందరం. "ఏం పరవాలేదు చంద్రం! నువ్వేం ఆందోళన పడద్దు. ఈ సందు చివర్లో నాకు తెలిసిన డాక్టరు ఉన్నాడు. తీసుకువస్తాను" అంటూ బయటికి వెళ్ళిపోయాడు. ఓ పదిహేను నిమిషాల తర్వాత ఒక కుర్ర డాక్టరుని వెంటపెట్టుకుని వచ్చాడు. డాక్టర్ స్టెత్‌తో పరీక్షచేసి, తన దగ్గరున్న కిట్టులోంచి రెండు మాత్రలు అన్నయ్య చేత మింగించాడు. "పొద్దునికి మాత్రలు తెచ్చుకోండి" అంటూ ఓ చీటీలో మాత్రల పేర్లు రాసిచ్చాడు. వెళ్ళిపోతూ 'ఏం పర్వాలేదు' అని ధైర్యం చెప్పి వెళ్లిపోయాడు డాక్టరు.

గంట తర్వాత అన్నయ్యకు జ్వరం తగ్గుముఖం పట్టింది. మెదలకుండా నిద్రపోయాడు. సుందరం వరండాలోనే పడుకున్నాడు- బండల మీదే! మనను కుదుటపడ్డాక నేను నిద్ర కుపక్రమించాను. ఎప్పడు నిద్రపట్టిందో తెలీదు.

## 4

ఉదయం ఏడుగంటలవుతున్నా నిరసంగానే పడుకుని వున్నాడు అన్నయ్య. బ్రెడ్డూ, మందులు తేవడానికి తలుపు అడ్డంగా వేసి, బజారుకు వెళ్ళాను. బజారుమంచి వచ్చేటప్పటికి అన్నయ్య మంచంపై కూర్చుని వున్నాడు.

"ఎట్లా వుందన్నయ్యా!"


"ఊ.. బాగానే వుందిరా" అంటూ వంటింటి వైపు విచిత్రచూపులు చూస్తున్నాడు. ఎందుకో అర్థం కాలేదు నాకు. పాలుకాచి తెద్దామని ఇంట్లోకి వెళ్తున్నాను.

వంటింట్లోంచి సుందరం వస్తున్నాడు!

అందుకేనా అన్నయ్య విచిత్ర చూపులు చూసింది!

"నీకు బుద్ధుందా?" అన్నాను కట్టలు తెంచుకుని వస్తోన్న కోపంతో.

"అది కాదు చంద్రం! శివాకు ఆకలవుతోంది.



పాలు కావాలంటే..." అంటూ నసిగాడు.

"నీ స్థానమేమిటో తెలుసుకో... ఇప్పుడు మా అమ్మానాన్న వుండుంటే నీ పరిస్థితి ఏమయివుండో తెలుసా? ఛీఛీ..." అన్నాను ఏమనాలో, ఎలా తిట్టాలో తెలియక.

"ఒరే చంద్రం! వాణ్ణేమీ అనొద్దురా! వాడు వంటింట్లోకి వెళ్లవంటే వెళ్లనన్నాడు.. నేనే..." అంటున్నాడు అన్నయ్య.

ఇంకా అక్కడే వుంటే నేను మరేమైనా అంటానని అనుకున్నాడేమో, అతను బయటికి వెళ్ళిపోయాడు. తప్పుచేసినవాడు ఇంకేమి మాట్లాడతాడు!

"బాగుంది.. అతను వంటింట్లోకి వెళ్ళిన విషయం అమ్మానాన్నలకు తెలిస్తే!" అన్నాను కోపం ఏమాత్రం తగ్గకుండా— అన్నయ్యతో.

"ఎట్లా తెలుస్తుందిరా— చెప్పను కదా!"

"అదే నీ వితండవాదం! నువ్వెళ్ళమన్నంతమాత్రాన అతనెట్లా వెళ్తాడు.. ఛాన్స్ దొరికింది కదా— ఈ ఇంటిని మైల చేయవచ్చు అని వెళ్ళుంటాడు. వాళ్ల రక్తంలోనే వుంది నీచత్వమంతా!" అన్నాను అసహనంగా.

"రక్తంలో ఏముంటుందిరా! వాడూ మనలాంటి మనిషే కదా! వాడి రక్తం, మన రక్తం అంతా ఎరుపుదేగా!"

"ఏం కాదు.. రక్తం ఎవ్వరిదైనా ఎరుపుగా వున్నా, ఆ కులం వాళ్ళకి చండాలమంతా ఆ రక్తంలో ఇమిడివుంటుంది!" అన్నాను ఉక్రోషంగా.

"చంద్రం! ఇంకేం మాట్లాడొద్దు. ఎక్కువగా మాట్లాడావంటే నిన్నేం చేస్తానో నాకే తెలీదు.. నాన్నకు ఆక్సిడెంటయినవుడు రక్తం కావాల్సివచ్చినవుడు వాడేరా రక్తాన్ని దానం చేసింది.. నువ్వూ, నేనూ నాన్న రక్తాన్ని పంచుకుని వుట్టినా మన ఇద్దరిదీ నాన్న గ్రూపు రక్తం కాదు మరి!" అని అన్నయ్య చెబుతుంటే షాక్ తిన్నాను.

"అబద్ధం!" అంటూ అరిచాను.

"నిజం.. ఈ నిజం వాడికీ, నాకే తెలుసురా!"

నాకు తల తిరిగిపోయింది. అంటే— పవిత్రమైన నాన్న రక్తం కలుషితమైపోయిందా? ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు.

అమ్మానాన్నలు— ఉదయమే పెళ్ళినుంచి వచ్చేశారు. నేను తెలుసుకున్న విషయాన్ని నాన్నతో చెప్పేయాలనిపిస్తోంది. తీరా చెబితే నాన్న ఏమయిపోతాడోనని భయం! అయినా చెప్పకుండా వుండడమెట్లా? మరునటిరోజు ఉదయం నాన్న వరండాలో కూర్చుని ఆఫీసు ఫైలు ఏదో రాసుకుంటూ వున్నాడు. అమ్మ వంటింట్లో టిఫెన్ తయారుచేస్తోంది. అన్నయ్య ఎక్కడికి వెళ్ళాడో తెలీదు.

"నాన్నా!" మెల్లిగా పిలిచాను.

"ఊ.." అన్నాడు తలెత్తకుండానే.

"ఒక నిజం చెప్పాలని వుంది"

"ఊ చెప్పూ" తలెత్తకుండానే అన్నాడు నాన్న.

"మొన్న నీకు ఆక్సిడెంటు అయినవుడు రక్తదానం ఎవరు చేశారో తెలుసా?" అని అన్నానే కాని, ఎందుకు ఈ విషయం మొదలుపెట్టానా అనిపిస్తోంది.

"తెలుసు" అన్నాడు నాన్న.

"నువ్వు తెలుసు అనుకుంటున్నది నిజం కాదు" అన్నాను.

నాన్న తలెత్తి నావైపు చూస్తూ "ఏది నిజం కాదు" అన్నాడు.

"అన్నయ్య నీకు రక్తదానం చేశాడన్నది నిజం కాదు!"

అలా నావైపు గుడ్లప్పగించి చూస్తున్నాడు నాన్న— షాక్ తిన్నాడా?

"సుందరం నాన్నా! నీకు రక్తదానం చేసింది!"

"అవును, నాకు ఎప్పుడో తెలుసు!" అని నాన్న అంటూ వుంటే ఈసారి నేను షాక్ తిన్నాను.

"నీకెవరు చెప్పారు నాన్నా!" అన్నాను అయోమయంగా.

"ఆస్పత్రిలో బ్లడ్ టెస్ట్ చేసే పరమేశ్వరం నా క్లాస్‌మేటేరా! వాడే చెప్పాడు" ఏం మాట్లాడాలో తెలీక నిశ్చలంగా నాన్నవైపు చూస్తూ వుండిపోయాను.

"చూడు చంద్రం! చిన్నప్పుడు ఆకలి బాగా అవాలని గాడిదపాలు తాపుతారు.. అది ఔషధంగా మాత్రమే! అట్లాగని గాడిద తల్లి అవుతుందా? ఇదీ అంతే!" అని నాన్న అంటున్నాడు. అన్నయ్య సుడిగాలిలా లోపలికి దూసుకువచ్చాడు. కోపంతో అన్నయ్య ముక్కుపుటాలు అదురుతున్నాయి.

"ఏమిటి నాన్నా మీరంటున్నది? రక్తాన్ని ఇచ్చి మీ ప్రాణాన్ని నిలబెట్టిన మనిషిని గాడిదతో పోలుస్తున్నారా? మీ తీరు చూస్తూ వుంటే మనుషుల్లో ఇంత భయంకరంగా ఆలోచించే వాళ్లున్నారా అనిపిస్తోంది.. ఛీఛీ.." అని గబగబా ఆవేశంతో ఆవేసి ఇంట్లోకి వెళ్ళిపోయాడు అన్నయ్య.

నాన్న అవాక్కయిపోయి అన్నయ్య వెళ్లినవేపే చూస్తున్నాడు.

ఇప్పుడు అన్నయ్య మాటల్లో నిజమేదో కొంచెం కొంచెమే అర్థమవుతోంది నాకు.

## మరో రోజు గడిచింది



నిన్న సూర్యుడు
మామూలుగానే ఉదయించి అస్తమించాడు
అమావాస్య కాబోలు చంద్రుడు రాలేదు
ఒక గులాబి విచ్చి
రాత్రికల్లా అవిసి నిద్దరోయింది
గుండె బేజారయ్యే రణగొణ ధ్వనుల్తో
రోజంతా హడావిడి పడ్డ జనాలు నిండిన ఈ బజారు
అర్ధరాత్రి నిశ్శబ్దాన్ని కౌగిలించుకుంది ఏమీ కానట్లుగా
మరో రోజు గడిచి పోయింది
జీవితంలో ఏమీ జరక్కుండానే
నిన్న నీ గురించిన వేడి ఊహలు
ఉలిక్కిపడిన హృదయ స్పందనలు
రోజులు గడుస్తుంటే మొద్దుబారుతున్నాయి
సూదులతో గుండెను గుచ్చినట్లున్న
నిన్న మొన్నటి బాధ కూడా
ఇవాళ శరీరంలో భాగమైనట్టు ఫీలింగ్
రేపు కూడా ఇలాగే ఈవెంట్ వెస్‌గా గడిచి
స్తబ్దత నిండుతుందన్న భయం
ఎనెస్తీషియాలా శరీరంలో వ్యాపించింది
అవును! ఎవరికి కావాలి ఈ రోజు గడిస్తే
ఈ పూవు వాడితే ఈ గుండె పగిలితే
రేపు మళ్ళీ వచ్చే ఉదయం చాటున
నిన్నటి ఆలోచనలు కరిగి పోతాయి
ఆవేదనలు మిగిలి పోతాయి
రెప్పల వెనకాల నిండిపోతాయి కన్నీటి జ్ఞాపకాలు
ఇకముందు కూడా
సూర్యుడు మామూలుగానే ఉదయిస్తూ అస్తమిస్తాడు

— దిలీప్